క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్ శ్రీహరిబాబును సన్మానిస్తున్న వార్డు సచివాలయ సిబ్బంది

కదిరి టౌన్: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబును 27 వార్డుల సచివాలయాల సిబ్బంది సన్మానించారు. శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కదిరి మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబును అనంతపురం మున్సిపాలిటీకి బదిలీ చేశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది హిమగిరి, శేఖర్, యుగంధర్, ఈశ్వర్‌రెడ్డి, సెక్రటరీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రూప

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన రూపను నియమిస్తూ పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపికకు సహకరించిన పార్టీ అధ్యక్షులు, నాయకులకు రూప కృతజ్ఞతలు తెలిపారు.

సంస్కృతీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు న్యాక్ గుర్తింపు



సంబరాలు చేసుకుంటున్న సిబ్బంది

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి సమీపంలోని బీడుపల్లి వద్ద ఉన్న సంస్కృతీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) 'ఏ' గుర్తింపు లభించింది. జనవరి 24వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం నాణ్యమైన విద్యను అందించడానికి కళాశాల అనుసరిస్తున్న నాణ్యతా ప్రమాణాలను ధ్రువీకరించింది. బృందం నివేదిక ఆధారంగా న్యాక్ శుక్రవారం కళాశాలకు 'ఏ' గ్రేడ్‌ను ప్రకటించింది. భవిష్యత్తులో మరింత నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మంచి ఫలితాలు సాధించేందుకు న్యాక్ గుర్తింపు దోహదం చేస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్ కుమార్ తెలిపారు. అనంతరం కళాశాల సిబ్బంది సంబరాలు చేసుకున్నారు.

ఉద్యోగులకు వీడ్కోలు



ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్‌ఐను సన్మానిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: స్థానిక ఎస్పీ చాంబర్‌లో శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్‌ఐలు మహమ్మద్ సలార్, హెడ్ కానిస్టేబుల్ నారాయణస్వామిని ఎస్పీ మాధవరెడ్డి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఓ సుజాత, సూపరెండెంట్ సరస్వతి, పోలీస్ అధికారుల సంఘం మెంబర్ సూర్యకుమార్, దాదాపీర్ పాల్గొన్నారు. అలాగే బదిలీపై వెళ్తున్న డీఎస్పీ హుస్సేన్ పీరా, ఎస్‌బీ సీఐ రవీంద్రారెడ్డి, నారాయణరెడ్డి, సూర్యనారాయణ, ఆర్ఐ రాజశేఖర్‌రెడ్డి, టైటాస్, నారాయణ, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ప్రదీప్ సింగ్, ప్రసాద్‌ను సన్మానించారు.

కేజీబీవీ విద్యార్థులకు అభినందన



ట్రోఫీ, మెడల్స్ చూపుతున్న విద్యార్థినులు

తాడిమర్రి: అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో ఇటీవల జరిగిన కబడ్డీ లీగల్ టోర్నమెంట్‌లో స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ ఏ.వాణిశ్రీ తెలిపారు. శుక్రవారం కేజీబీవీలో విద్యార్థులను అభినందించారు. అలాగే ధర్మవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో కూడా తృతీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. పీఈటీ కవితను ప్రిన్సిపాల్ అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బత్తలపల్లి: మండల కేంద్రం శివారులోని పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.11,040 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ముగ్గురు పేకాటరాయుళ్లను ధర్మవరం కోర్టులో హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

పేదల అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్ (ముదిగుబ్బ): పేదల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం ముదిగుబ్బ మండలంలోని ఏబీపల్లి తండా, ఏబీపల్లి బీసీ కాలనీల్లో పర్యటించారు. తొలుత గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక గుర్తింపు లభించిందని తెలిపారు. ముఖ్యంగా వీరిని రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ముందుకు తీసుకొచ్చి ప్రత్యేక గుర్తింపు కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంటే జీర్ణించుకోలేని చంద్రబాబు నాయుడు, పచ్చ పత్రికలు విషం కక్కుతున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో సంక్షేమ పథకాలు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే అందాయన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు లంచాలు తీసుకొని అనర్హులకు సంక్షేమ పథకాలను అందించి అర్హులకు అన్యాయం చేశారని ఆరోపించారు. జగనన్న ప్రభుత్వంలో కుల, మతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. తాను కోట్లాది రూపాయలతో ధర్మవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలుస్తున్నట్లు స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యమని వెల్లడించారు. మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, సర్పంచ్ కుళ్లాయప్ప నాయక్, నాయకులు సేవే నాయక్, శంకర్ నాయక్, తిరుపాల్ నాయక్, వెంకట నారాయణ, రవినాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

రూ.2.50 కోట్లతో పంచాయతీ అభివృద్ధి

ధర్మవరం రూరల్ (ముదిగుబ్బ): ముదిగుబ్బ మండలం ఏబీపల్లి (అడవి బ్రాహ్మణపల్లి) తండాలో రూ.2.50 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలా ఫలకాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. గత నాలుగేళ్లుగా గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణం, అలాగే ఎంజీఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.9 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. అదే విధంగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం నిర్మాణం, మన బడి నాడు నేడు కింద అభివృద్ధి పనులు, జలజీవన్ మిషన్ పథకం కింద తాగునీటి సౌకర్యం కోసం పైపులైన్ అభివృద్ధి పనులు తదితర వాటి కోసం రూ1.7 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధే జగనన్న లక్ష్యం



ఉస్తినిపల్లి తారురోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి
- తారురోడ్డు, ఆర్‌బీకే, సచివాలయ భవనం ప్రారంభం

తనకల్లు: గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉస్తినిపల్లి-తనకల్లు వరకూ రూ.86 లక్షల వ్యయంతో నిర్మించిన తారురోడ్డును శుక్రవారం ప్రారంభించారు. అంతకుముందు బాలసముద్రం, టీజ సదుం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలు, గోళ్లవారిపల్లిలో ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ సహకారంతో కదిరి నియోజకవర్గం వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు సైతం అప్రోచ్ రోడ్లు, తారురోడ్లను వేయించామన్నారు. ఉస్తినిపల్లి నుంచి తనకల్లు వరకూ తారురోడ్డు కోసం ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు ఎదురు చూశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం గ్రామానికి తారురోడ్డును నాణ్యతగా వేసి పూర్తి చేశామని తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, సర్పంచులు సరస్వతీ, సుజాత, రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ హిమధర్‌రెడ్డి, కో-ఆప్షన్ రహంతుల్లా, నాయకులు శ్రీనివాసులు నాయుడు, గణేష్‌రెడ్డి, చిదానందరెడ్డి, బాల్‌రెడ్డి, చిన్నపరెడ్డి, సిద్దారెడ్డి, బాబాఫక్రుద్దీన్, బషీర్, సలీం, అహమ్మద్, నాగభూషణ, వెంకటరమణ, హేమశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, వెంకటనారాయణ, పూల శీనా, ఈశ్వర్‌రెడ్డి, జేసీబీ అలీ, గౌస్‌పీర్, రామకృష్ణ, రమేష్‌నాయక్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేరుకుళ్లుతో అప్రమత్తంగా ఉండాలి

తాడిమర్రి: చీనీ చెట్లకు సోకే వేరుకుళ్లు తెగులు నుంచి అప్రమత్తంగా ఎండాలని ధర్మవరం డివిజన్ ఉద్యాన శాఖ అధికారిణి అమరేశ్వరి సూచించారు. మండలంలోని కునుకుంట్లలో రైతు రామలింగారెడ్డికి చెందిన చీనీ తోటను శుక్రవారం పరిశీలించారు. ఎండిన చీనీ చెట్లను పరిశీలించి, సూచనలిచ్చారు. ఎండల తీవ్రత పెరగడంతో చీనీ చెట్లకు వేరుకుళ్లు తెగులు ఆశించి చాలా చెట్లు చనిపోవడం జరుగుతోందన్నారు. రైతులు తెగుళ్లను తొలిదశలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. చెట్టు విపరీతంగా పూత, పిందె పట్టి కాయలు ముదిరేలోగా చెట్టు చనిపోతుందన్నారు. చెట్లకు నీరు పెట్టినప్పటికి వాడు లక్షణాలు కనిపిస్తే వెంటనే చెట్టుమీద కాయలు తొలగించి ఒక కిలో యూరియాను 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆరు నెలలకు ఒకసారి పశువుల ఎరువు, వేపపిండి, ట్రైకోడర్మా మిశ్రమం (90 కిలోల పశువుల ఎరువు, 10 కిలో వేపపిండి, రెండు, మూడు కిలోల ట్రైకోడర్మా విరిడి



కునుకుంట్లలో చీనీ తోటను పరిశీలిస్తున్న హెచ్ఓ అమరేశ్వరి

చొప్పున 10 రోజుల పాటు బాగా నీటిలో మురగబెట్టి చెట్టుకు 5–8 కిలోల చొప్పున వేస్తే చెట్లు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. చెట్టు మొదలు దగ్గర నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్బెండజిమ్ గ్రాము, మాంకోజెబ్ 2.5 గ్రాములు, మేటలాక్సిల్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి చెట్టు పాదళ్ల దగ్గర తడపాలన్నారు. హెచ్ఏఏ గౌతమి పాల్గొన్నారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



శివ నాగప్రసాద్



రాణెమ్మ



మహబూబ్ ఖాన్

బత్తలపల్లి: బత్తలపల్లి ఎంపీడీఓగా ఏ.శివ నాగప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు జిల్లా ఓర్వకల్లు నుంచి బదిలీపై బత్తలపల్లికి వచ్చారు. జెడ్పీ సీఈఓ ఆదేశాల మేరకు బత్తలపల్లి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అందరి సహకారంతో మండలాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓను సూపరిండెంట్ శ్రీదేవి, కార్యాలయ సిబ్బంది పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎంపీపీ బగ్గిరి త్రివేణిని మర్యాదపూర్వకంగా కలిశారు.

నల్లచెరువు ఎంపీడీఓగా రాణెమ్మ

నల్లచెరువు: నల్లచెరువు ఎంపీడీఓగా ఎం.రాణెమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె కర్నూలు జిల్లా ఆస్పరి మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న బి.శుకుంతల కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. అనంతరం నూతన ఎంపీడీఓ ఎం.రాణెమ్మ విలేకరులతో మాట్లాడుతూ.. మండలాభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

నల్లమాడ ఎంపీడీఓగా మహమ్మద్ దౌలా

నల్లమాడ: నల్లమాడ ఎంపీడీఓగా మహమ్మద్ దౌలా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా చాగలమర్రి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన కొండన్నను ఉన్నతాధికారులు కర్నూలు జిల్లాకు బదిలీ చేసిన విషయం విదితమే.

తలుపుల ఎంపీడీఓగా మహబూబ్ ఖాన్

తలుపుల: తలుపుల ఎంపీడీఓగా మహబూబ్ ఖాన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నుంచి బదిలీపై వచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నూతన ఎంపీడీఓ తెలిపారు.

'ఈ-క్రాప్' నమోదు తప్పనిసరి

ఎన్పీకుంట: 2023–24 ఏడాదికి సంబంధించి రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలను ఈనెల 10వ తేదీలోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లోకేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గౌకనపల్లి, వెలిచలమల, మరికోమ్మదిన్నె గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదుపై సూపర్ చెక్ చేపట్టారు. మండల వ్యాప్తంగా 4 వేల ఎకరాల్లో పంట నమోదు పూర్తి చేశామని పేర్కొన్నారు.

ఉచితంగా కార్పొరేట్ వైద్యం

బత్తలపల్లి: పేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైస్ ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి అన్నారు. శుక్రవారం దంపెట్ల సచివాలయ ఆవరణలో సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, మాదిరెడ్డి పద్మావతి అధ్యక్షతన వైద్య శిబిరం నిర్వహించారు.

తాడిమర్రి: మండలంలోని పిన్నదరి గ్రామ సచివాలయంలో శుక్రవారం వైద్యాధికారులు రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు గోవర్ధన్ నాయుడు, హరిత, గైనకాలజిస్టు కిశోరి, జనరల్ ఫిజీషియన్ ప్రవీణ్ కుమార్ తదితర వైద్యాధికారుల బృందం 362 మందికి వైద్య పరీక్షలు చేశారు.

నల్లమాడ: దొన్నికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆల్ట్రా విజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 85 మంది విద్యార్థినీ, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

ధర్మవరం రూరల్ (ముదిగుబ్బ): వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని కదిరి ఎంవీఐ అధికారి వరప్రసాద్ సూచించారు. శుక్రవారం ముదిగుబ్బ మండలంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ క్యాలెండర్‌ను సత్యసాయి జిల్లా అధ్యక్షుడు అన్నం సుధాకర్, ఎంఈఓ రాజేశ్వరి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరి వరకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళపై కొడవలితో దాడి

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని 20వ వార్డు కమ్మవారిపల్లి గ్రామంలో వేణుగోపాల్ నాయుడు అనే వ్యక్తి మద్యం సేవించి సుకన్య అనే మహిళపై కొడవలితో దాడి చేశారు. పాతకక్షలు, భూ సమస్యల నేపథ్యంలో సదరు మహిళను దూషిస్తూ గ్రామస్తులపై కూడా దాడి చేశాడు. అర్బన్ సీఐ కొండారెడ్డి గ్రామానికి చేరుకుని వేణుగోపాల్‌వద్ద ఉన్న కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. అతడ్ని స్టేషన్‌కు తరలించారు. సుకన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వృద్ధాశ్రమానికి ఆర్థికసాయం

అమడగూరు: మండలంలోని గాజులపల్లి సమీపంలో ఉన్న శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమానికి కర్ణాటక ప్రాంతానికి చెందిన అగ్రహారం సతీష్, ఉష దంపతులు రూ.10 వేలు అందజేశారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలసి వారు ఆశ్రమానికి వెళ్లి నిర్వాహకురాలు అరుణజ్యోతికి సాయాన్ని అందజేశారు. కుటుంబ పెద్ద వెంకట నారాయణప్ప వర్ధంతిని పురస్కరించుకుని సాయాన్ని ఇచ్చినట్లు దాతలు తెలిపారు.

నేడు తారురోడ్ల ప్రారంభం

గాండ్లపెంట: మండల పరిధిలోని గొడ్డువెలగల, కత్తివారిపల్లి గ్రామాలకు నూతనంగా నిర్మించిన తారురోడ్లను శనివారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు గొడ్డువెలగల, 10:30 గంటలకు కత్తివారిపల్లి గ్రామాల్లో తారురోడ్లను ఎమ్మెల్యే సిద్దారెడ్డి ప్రారంభిస్తారన్నారు.

చంద్రబాబు అబద్ధపు హామీలు నమ్మకండి





ముత్తువకుంట్లలో జరిగిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పేరూరు: సమావేశంలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: అధికారం కోసం టీడీపీ నేత చంద్రబాబు చెప్పే అబద్ధపు హామీలను ఎవరూ నమ్మొద్దని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ముత్తువకుంట్లలో జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముత్తువకుంట్ల, తల్లిమడుగుల గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణాలన్నీ నాలుగు విడతల్లో మాఫీ చేశారన్నారు. వీటితో పాటు అమ్మఒడి, వైఎస్సార్ చేయూత వంటి పథకాల ద్వారా సుమారు రూ.2.5 లక్షల కోట్లు మహిళ ఖాతాల్లో జమ చేశారన్నారు. కానీ చంద్రబాబు 2014 ఎన్నికల ముందు 600 హామీలు ఇచ్చి, ఆతర్వాత అధికారంలోకొచ్చాక ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుండా అన్ని రైతులు, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశాడన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతా ఐదేళ్లలో 50 వేల పింఛన్లు, 15 వేల ఇళ్లు, 2 వేల మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించామన్నారు. వీటితో పాటు సీఎం జగనన్న సహకారంతో పేరూరు డ్యాంకు కృష్ణ జలాలు తీసుకొని వెనుకబడిన ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశామన్నారు. 25 ఏళ్ల పాటు ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేలు, మంత్రులుగా కొనసాగిన పరిటాల కుటుంబ సభ్యులు పేద ప్రజల కోసం ఏ ఒక్క పనిచేయలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంత్రి పథకం ఏసీ రామేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, డైరక్టర్ ప్రభాకర్, ఏపీఎం హేమలత, ఈఓఆర్డీ అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్

రామగిరి: కుల, మత, ప్రాంతాలకతీతంగా అన్ని వర్గాలకు సమ న్యాయం చేసింది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపురం, పేరూరు, నసనకోట, రామగిరిలలో జరిగిన 'వైఎస్సార్ ఆసరా' చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ ప్రజలను మభ్యపెడుతూ అమలు చేయలేని హామీలు ఇస్తుందన్నారు. అనంతరం వాటిని పక్కనపెట్టి దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకుంటుందన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశాం..

నియోజకవర్గంలో పరిటాల కుటుంబ సభ్యులు 20 ఏళ్లకుపైగా మంత్రులు, ఎమ్మెల్యేలుగా పదవులు అనుభవించి, అభివృద్ధిని విస్మరించారని ఎమ్మెల్యే విమర్శించారు. కనీసం పేరూరు డ్యాంకు నీరిద్దామనే ఆలోచనేలేదన్నారు. ఎన్నికల సమయంలో హామీలిచ్చి అనంతరం గ్రామాల్లో తిరగకుండా సొంతపనులపై దృష్టిపెట్టి దోచుకొని దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. 20 ఎకరాల నుండి రెండువేల ఎకారాలతోపాటు భారీగా ఆస్తులు కూడబెట్టుకొని, ప్రజలను విస్మరించారన్నారు. రామగిరిలో ముత్యాలమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకురావడంతో పాటు బంగారు గనులను తెరిపించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆత్మకూరు, రామగిరి, కనగానపల్లి మండలాల్లో తాగునీటి అవసరాన్ని రెండు, మూడు నెలల్లో తీరుస్తామన్నారు. ప్రతి నెలా 1న పింఛన్ పంపిణీ, ఆర్‌బీకేల ద్వారా రైతులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాట మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలతోపాటు అందరికీ న్యాయం చేస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో మరోమారు పార్టీని అధికారంలోకి తెచ్చుకునేందుకు నడుం బిగిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలకు వైఎస్ఆర్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. పేరూరులో వెన్నెముక సమస్యతో బాధపడుతున్న శ్రీనివాసులుకు రూ.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీలు నాగార్జున, మారుతీ ప్రసాద్, మండల కన్వీనర్లు కర్రా హనుమంతరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు మీనుగ నాగరాజు, రాజేష్, గంగుల సుధీర్‌రెడ్డి, ఆదిరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, రామ్మూర్తి, జేష్ఠ్య రామయ్య, రామలింగారెడ్డి, బండారు అనిల్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

కనగానపల్లి: మండలంలోని కనగానపల్లి, యలకుంట్ల, తగకుంట, మద్దెలచెరువు, చంద్రాశ్చర్ల, మామిళ్లపల్లి గ్రామాల్లో శనివారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహిస్తామని ఏపీఎం హేమలత తెలిపారు. ఈ సంబరాలకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

కదిరి మున్సిపల్ కమిషనర్‌గా కిరణ్ కుమార్

కదిరి టౌన్: కదిరి నూతన మున్సిపల్ కమిషనర్‌గా ఎం.కిరణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న శ్రీహరిబాబు అనంతపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. నూతన మున్సిపల్ కమిషనర్‌కు మున్సిపల్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

శారీ రోలింగ్‌లో ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందిస్తున్న నాబార్డ్ డీడీఎం అనూరాధ

పుట్టపర్తి: బుక్కపట్నం పాత వెలుగు కార్యాలయంలో నాబార్డు సౌజన్యంతో జీవాశ్రమం ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళలకు శారీ రోలింగ్‌పై ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. శిక్షణ పొందిన 30 మందికి నాబార్డు డీడీఎం అనూరాధ, జీవాశ్రమం కార్యదర్శి రమీజా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసిన వారికి బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించి జీవనోపాధికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో రమణమూర్తి, పద్మావతి, రామమోహన్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని బడన్నపల్లి గ్రామంలో శుక్రవారం కుష్టు వ్యాధిపై డాక్టర్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. కుష్టు మైకోబాక్టీరియం లెప్రి అనే సూక్ష్మక్రిమి ద్వారా సోకుతుందన్నారు. చర్మంపై ఎర్రని, రాగి రంగు మచ్చలు, శరీర వర్ణం కంటే కొంచెం పాలిపోయినట్లు ఉన్న స్పర్శలేని మచ్చలు కనిపిస్తే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కళావతి, సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ నందిని, హెల్త్ అసిస్టెంట్ ఆంజినేయులు, ఎస్ఎల్‌హెచ్‌పీ అశ్వని, ఏఎన్ఎం శ్యామల, ఆశాకార్యకర్తలు అలివేలమ్మ, ముత్యాలమ్మ, సుజాత, పెద్దక్క పాల్గొన్నారు.

అలవెన్సుల చెల్లింపుపై హర్షం

కదిరి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు జీతంతో కలిపి అలవెన్సులు చెల్లించేలా ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడంపై నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిమోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

ఎన్పీకుంట: మండల పరిధిలోని ఎదురుదోన పంచాయతీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఎంపీపీ ఈటె రాము శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి హాజరవుతారని తెలిపారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రైతులకు ఎరువులు అందజేయాలి

పుట్టపర్తి అర్బన్: రబీలో సాగవుతున్న వివిధ రకాల పంటలకు సకాలంలో ఎరువులు అందజేయాలని ఏడీఏ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి మండలం పెడపల్లి రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. రబీలో సాగైన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ ఎంత మంది రైతులకు ఎంత పరిమాణంలో ఎరువులు అందించారని రికార్డులను పరిశీలించారు. ఆర్‌బీకే పరిధిలోని రైతులకు సుమారు 90 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, యూరియా విక్రయించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ వెంకటబ్రహ్మం, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఏఈఓ ఆనంద్ నాయక్, ఆర్‌బీకే సిబ్బంది రమేష్, డింపుల్ తదితరులు పాల్గొన్నారు.